సాక్షి
నాగర్‌కర్నూల్
గురువారం । 28 । సెప్టెంబర్ । 2023



లిక్కర్ కల్తీ దందా!

కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో కొందరు కేటుగాళ్లు మద్యం కల్తీకి తెరలేపారు.

వివరాలు 8లో ▸



సరిహద్దుల్లో పటిష్ట నిఘా

ఉమ్మడి జిల్లా సరిహద్దుల్లో నిఘా పటిష్టం చేయాలని డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.2 /21.6

వాతావరణం

ఆకాశం కొంత మేర మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సివిల్ సప్లయ్ గోదాం తనిఖీ



కొల్లాపూర్: మున్సిపాలిటీలోని సివిల్ సప్లయ్ గోదాంను అదనపు కలెక్టర్ సీతారామారావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాంలోని స్టాక్ నిల్వలను, రికార్డుల్లో వివరాలను సరిచూశారు. రేషన్ దుకాణాలకు సప్లయ్ చేసిన బియ్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. పౌరసరఫరాల అధికారి స్వామికుమార్, డీటీ రామ్మోహన్ తదితరులున్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం




నాగర్‌కర్నూల్ రూరల్: నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం బుధవారం ప్రమాణ స్వీకారం నిర్వహించారు. మార్కెట్ కమిటీ నూతన చైర్‌పర్సన్‌గా స్వాతి, వైస్ చైర్మన్‌గా జైపాల్‌రెడ్డి ప్రమాణ స్వీకారం నిర్వహించి బాధ్యతలు చేపట్టారు. కమిటీ సభ్యులుగా కవిత, అబ్దుల్ హమీద్‌ఖాన్, హుస్సేని, యాదవరెడ్డి, సురేష్, రాములు, చెన్నయ్య, నర్సింహారెడ్డి, వెంకటేష్, కృష్ణయ్య, కళావతి, రవికుమార్ ఎంపికయ్యారు. కార్యక్రమానికి గన్యాగుల పీఏసీఎస్ చైర్మన్ కృష్ణయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి, నాగర్‌కర్నూల్ వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్‌బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పీఎఫ్ సభ్యత్వం ఉండాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో పని చేస్తున్న ప్రతి ఉద్యోగి విధిగా పీఎఫ్ సభ్యత్వం కలిగి ఉండాలని, రిటైర్డ్ తర్వాత తమ విశ్రాంత జీవితానికి ఎంతో ఆసరాగా ఉంటుందని మాదాపూర్ పీఎఫ్ కార్యాలయంలోని మహబూబ్‌నగర్ నోడల్ అధికారి మఠం రాజశేఖర్ అన్నారు. జిల్లాలోని పీఎఫ్ ఖాతాదారులు, ఈపీఎఫ్ పెన్షనర్ల సందేహాలను నివృత్తి చేయడానికి బుధవారం స్థానిక పారిశ్రామికవాడలోని సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో నిధి అప్‌కే నికత్ 2.0 కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పీఎఫ్ ఖాతాదారుల సమస్యలు పరిష్కరించి, వారికి కలిగే అదనపు ప్రయోజనాలను వివరిస్తున్నామని తెలిపారు. ఈ డీఎల్ఐ స్కీంలో భాగంగా పీఎఫ్ సభ్యులకు ఏకంగా రూ.7 లక్షల వరకు ఉచిత బీమా లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పీఎఫ్ కార్యాలయ సీనియర్ సోషియల్ సెక్యూరిటీ అసిస్టెంట్ ఖాజాపాష, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం జిల్లా అధ్యక్షుడు రాజసింహుడు, భగవంతు, అబ్దుల్ కరీం, డేవిడ్, వెంకటయ్య, పుల్లయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాల బస్సులను వినియోగించుకోండి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ సంస్థ భక్తుల సౌకర్యార్థం పుణ్యక్షేత్రాలకు వెళ్లడానికి ప్రత్యేక బస్సులు నడుపుతోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి అన్నారు. పౌర్ణమిని పురస్కరించుకొని మహబూబ్‌నగర్ నుంచి అరుణాచలం గిరి క్షేత్రంకు వెళ్లే ప్రత్యేక బస్సును బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పౌర్ణమిని పురస్కరించుకొని అరుణాచలం వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సు మహబూబ్‌నగర్ బస్టాండ్ నుంచి బయలుదేరి గురువారం ఉదయం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాళహస్తి, తిరుత్తని సుబ్రహ్మణ్యం స్వామి దేవాలయాల దర్శనాల అనంతరం మధ్యాహ్నం కాంచీపురానికి చేరకుంటుందని తెలిపారు. అక్కడ కామాక్షి అమ్మవారి దర్శనం అనంతరం రాత్రి 8 గంటలకు అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. అరుణచాలం గిరి ప్రదక్షిణ అనంతరం మధ్యాహ్నం బస్సు బయలుదేరి ఈనెల 30న ఉదయం 5 గంటలకు మహబూబ్‌నగర్‌కు చేరుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సుజాత, అసిస్టెంట్ మేనేజర్లు రాంజీ, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఉపాధికి భరోసా..

డీఆర్‌డీఓ ద్వారా మహిళల స్వయం ఉపాధికి యూనిట్ల మంజూరు

- కేవీకే శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రాలపై శిక్షణ
- ఉపాధి కూలీలతో ఆహార ఉత్పత్తుల తయారీకి ప్రోత్సాహం
- జిల్లావ్యాప్తంగా 1,500 మందికి చేరేలా ప్రణాళిక
- ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు



పాలెం కేవీకేలో మహిళలకు వంటకాలపై శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు



'ఈ ఫొటోలోని మహిళ పేరు మహమ్మూద్ సైబీ. జిల్లాలోని పెంట్లవెల్లికి చెందిన ఈమె జిల్లా డీఆర్‌డీఓ అధికారుల సహకారంతో రూ.3.85 లక్షల రుణం తీసుకుని మరమరాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం వ్యాపారం బాగా నడుస్తోందని, భవిష్యత్‌లో యూనిట్ మరింత విస్తరిస్తానని చెబుతోంది.



'జిల్లాలోని కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామానికి చెందిన సుల్తానాబీ ప్రభుత్వం నుంచి రూ.3.90 లక్షల రుణం తీసుకుంది. రోటీ మేకర్ మిషన్‌ను కొనుగోలు చేసి గ్రామంలోని యూనిట్‌ను ఏర్పాటు చేసుకుంది. నిత్యం సోమశిలకు వస్తున్న పర్యాటకులకు రద్దీకి అనుగుణంగా రోటీలను తయారు చేసి అందిస్తోంది. తద్వారా మంచి ఆదాయం పొందుతున్నానని చెబుతోంది.

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలోని ఉపాధి హామీ కూలీలు, మహిళలకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోంది. డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో మహిళలకు రుణ సౌకర్యం కల్పించి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అధికారులు ప్రోత్సాహం అందిస్తున్నారు. వ్యాపారంలో రాణించేందుకు జిల్లాలోని కృషి విజ్ఞాన కేంద్రం పాలెం ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. జిల్లాలోని ఉపాధి హామీ కూలీలుగా పనిచేస్తున్న మహిళలు ఆహార యూనిట్ల ద్వారా ఆదాయాన్ని పెంచుకునేలా ఏర్పాట్లు సాగుతున్నాయి.

తొలివిడతలో 1,500 మందికి..

జిల్లావ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో పని చేసే మహిళలు తమ ఆదాయాన్ని పెంచుకునేందుకు ఆహార యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం సహకారం అందిస్తోంది. ఇప్పటికే జిల్లాలోని కొల్లాపూర్, పెంట్లవెల్లి, పెద్దకొత్తపల్లి, వెల్దండ, వంగూరు తదితర మండలాల్లో ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మహిళలకు ఆర్థిక భరోసాగా నిలుస్తున్నాయి. మహిళలు తాము నివశిస్తున్న చోటే పిండిగిర్నీలు, రోటీ మేకింగ్ మిషన్లు, మరమరాలు, పచ్చళ్లు, లడ్డూలు, మురుకులు, బెల్లం, జొన్నలతో తయారు చేసిన ఆహార పదార్థాల యూనిట్ల కోసం రూ.3 లక్షల నుంచి గరిష్టంగా రూ.10 లక్షల వరకు సబ్సిడీతో కూడిన రుణాన్ని అందిస్తున్నారు. ఔత్సాహిక మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

కేవీకే ఆధ్వర్యంలో శిక్షణ..

మహిళలు ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో రాణించేలా పాలెంలోని కేవీకే శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగుతోంది. వర్మీ కంపోస్టు, నర్సరీల నిర్వహణతోపాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఆహార ఉత్పత్తులు, పచ్చళ్లు, లడ్డూలు, మిల్లెట్స్ ఉత్పత్తులతోపాటు కూరగాయలు, పండ్లతో తయారు చేసే ఉత్పత్తులపై శిక్షణ ఇస్తున్నారు. వీరి ఉత్పత్తులకు ప్రభుత్వ బ్రాండింగ్ పేరుతోపాటు నాణ్యతా ప్రమాణాలు పాటించి ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు పొందేందుకు సైతం సహకారం అందిస్తామని అధికారులు చెబుతున్నారు.

కూలీల పిల్లల కోసం 'ఉన్నతి'

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలు వంద రోజులు పూర్తయితే వారి పిల్లలకు సైతం మెరుగైన ఉపాధి కోసం శిక్షణ అందించేందుకు ప్రభుత్వం 'ఉన్నతి' కార్యక్రమాన్ని చేపట్టింది. ఇప్పటికే జిల్లా నుంచి 7 మందిని ఎంపిక చేసి వారికి మొబైల్ రిపేరింగ్, బైక్, ఇంజిన్ మెకానిక్ రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో 35 మందికి ఒక బ్యాచ్ చొప్పున వీరికి ట్రైనింగ్ ఇస్తూ ఉచిత భోజనం, వసతి కల్పిస్తున్నారు.

వంటకాలు నేర్పించారు..



కేవీకేలో ఇప్పటివరకు రాగి స్వీట్, బెల్లం, వేరుశనగతో లడ్డు, మురుకులు, మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీ తదితర వంటకాలను నేర్పించారు. ప్రభుత్వం రుణం ఇస్తే ఏదైనా ఆహార ఉత్పత్తుల యూనిట్ పెట్టుకుంటా. గ్రామంలోని ఇతర మహిళలతో కలిసి వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటాం.

– రేణుక, వనపట్ల, నాగర్‌కర్నూల్

శిక్షణ ఇస్తున్నాం..



డీఆర్‌డీఓ, కేవీకే అధికారుల సమన్వయంతో మహిళలకు ఆహార ఉత్పత్తులపై శిక్షణ ఇస్తున్నాం. మహిళలకు ఆదాయం లభించే యూనిట్లపై దృష్టిసారిస్తున్నాం. త్రుణధాన్యాలతో రాగిలడ్డు, మురుకులు, కూరగాయలు, పండ్ల ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తున్నాం. తక్కువ పరిమాణంలో ఎక్కువ పోషకాలు అందించే ఆహార ఉత్పత్తులపై శిక్షణ ఇస్తున్నాం.

– జ్యోత్స్న, కేవీకే శాస్త్రవేత్త

సత్ఫలితాలు వస్తున్నాయి..



జిల్లాలోని ఉపాధి హామీ కూలీల పిల్లలకు ఉపాధి శిక్షణతోపాటు మహిళలకు స్వయం ఉపాధి కోసం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తున్నాం. లబ్ధిదారులకు రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు సబ్సిడీ రుణాలు అందజేస్తున్నాం. ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లతో ఆదాయం పెంచుకునేలా శిక్షణ ఇప్పిస్తున్నాం. ఇప్పటికే ఏర్పాటు చేసుకున్న యూనిట్ల ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయి.

– నర్సింగ్‌రావు, డీఆర్‌డీఓ

ఆదర్శం.. కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం




కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

కందనూలు: కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం రేపటి తరానికి ఆదర్శమని బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి శ్రీధర్ అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని బుధవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధికారి శ్రీధర్ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ గర్వించే గొప్ప నేత అన్నారు. ప్రజాస్వామికవాదిగా, పీడిత ప్రజల పక్షపాతిగా, ఉద్యమకారుడిగా, నిబద్ధత కలిగిన గొప్ప రాజకీయ నాయకుడిగా ఆయన జీవితం రేపటి తరానికి ఆదర్శప్రాయమని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంతోపాటు అనేక ఉద్యమాల్లో క్రియాశీలకంగా నిలిచిన బాపూజీ.. బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే పరమావధిగా, తన జీవితకాలం ప్రజల కోసమే పరితపించారని పలువురు అధికారులు పద్మశాలి సంఘం నాయకులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప, వెంకటస్వామి, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు నిరంజన్, సత్యం, దుర్గాప్రసాద్, కార్యవర్గ సభ్యులు, అనిల్, లక్ష్మయ్య, జగదీష్, కార్యాలయ సిబ్బంది జనార్దన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'పాలమూరు' ద్వారా నీటి విడుదల

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరు గ్రామ శివారులో ఉన్న పాలమూరు– రంగారెడ్డి మొదటి లిఫ్టు నుంచి మొదటి పంపు ద్వారా అధికారులు బుధవారం సాయంత్రం నీటిని విడుదల చేశారు. డెలివరీ సిస్టం నుంచి ఒక పంపు ద్వారా నీటి విడుదలైన తర్వాత నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి వదిలారు. మధ్యాహ్నమే నీటిని విడుదల చేయాల్సి ఉండగా స్విచ్ యార్డు నుంచి కరెంట్ సరఫరాకు కొంత అంతరాయం కలగడంతో ఆలస్యమైనట్లు తెలిసింది. మొదటి పంపు నుంచి జరుగుతున్న నీటి విడుదల నాలుగు రోజులపాటు నిరంతరాయంగా కొనసాగుతుందని ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు అమర్‌సింగ్, లోకిలాల్, శ్రీనివాసులు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



మొదటి పంపు నుంచి విడుదలవుతున్న నీరు

రైతుల ఉసురు తగిలి బీఆర్ఎస్ కూలుతుంది..



మాట్లాడుతున్న బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్

- నిర్వాసిత రైతుల గోడు పట్టని ప్రభుత్వం అవసరమా?
- ఆత్మహత్య చేసుకున్న నిర్వాసిత రైతు కుటుంబాన్ని పరామర్శించిన ఈటల రాజేందర్

సాక్షి, నాగర్‌కర్నూల్: ప్రాజెక్టు ముంపులో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించని బీఆర్ఎస్ ప్రభుత్వం వారి ఉసురు తగిలి కుప్పకూలుతుందని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెరలో పరిహారం రాలేదని ఇటీవల ఆత్మహత్య చేసుకున్న నిర్వాసిత రైతు అల్లోజీ కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. ప్రాజెక్టుల్లో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు ఉన్నా సీఎం కేసీఆర్ వాటిని విస్మరించారన్నారు. ప్రజల అభ్యంతరాలను పట్టించుకోకుండా కేసీఆర్ తానొక చక్రవర్తిగా భావిస్తున్నాడనడానికి అల్లోజీ దీనగాథనే నిదర్శనమని చెప్పారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు కింద వట్టెం రిజర్వాయర్ ముంపునతో సంబంధం లేకున్నా, తప్పనిసరి కాకపోయినా సుందరీకరణ, ఇతర పనుల కోసమంటూ అల్లోజీ కుటుంబం నుంచి ప్రభుత్వం 19 ఎకరాల భూమిని సేకరించిందని వివరించారు. పక్క గ్రామంలో ఎకరాకు రూ. 10.50 లక్షలు ఇవ్వగా, కుమ్మెరలో మాత్రం ఎకరాకు రూ.3.50 లక్షలే కేటాయించారని చెప్పారు. న్యాయమైన పరిహారం కోసం అల్లోజీ కుటుంబం కోర్టుకు వెళితే, న్యాయవాదులను మేనేజ్ చేసుకుని ఎకరాకు రూ.2.04 లక్షలకే పరిహారం ఖరారు చేశారన్నారు. బాధిత రైతు అల్లోజీ సంబంధిత అధికారులు, ఎమ్మెల్యే చుట్టూ తిరిగినా ఈ ప్రభుత్వానికి జాలి కలగలేదని చెప్పారు. కోకాపేటలో ఎకరం రూ.వంద కోట్లు అంటూ భూములు అమ్ముకునే కేసీఆర్‌కు రైతుల భూముల ధర తెలియదా, రాష్ట్రంలో ఎక్కడైనా ఎకరాకు రూ.2 లక్షలు ఉంటుందా అని ప్రశ్నించారు. రైతులపై జాలి, కరుణ లేని ప్రభుత్వం అవసరమా అన్నది ప్రజలు ఆలోచించాలన్నారు. సీఎం కేసీఆర్‌కు తమ జాగీరులా రైతుల భూములను గుంజుకునే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. అల్లోజీ కుటుంబానికి చెందిన భూమిని తిరిగి అప్పగించాలని, బాధిత కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం న్యాయం చేయకపోతే బాధిత రైతు దుస్థితిని రాష్ట్రవ్యాప్తంగా ప్రజల ముందు ఉంచుతామన్నారు. బాధిత కుటుంబానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దిలీపాచారి రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, మనెమ్మ, సతీశ్‌మాదిగ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక డ్రైవ్

లింగాల: జిల్లాలో సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు డీఎంహెచ్ఓ సుధాకర్‌లాల్ తెలిపారు. బుధవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సీజనల్ వ్యాధులు మాత్రమే ప్రబలుతున్నాయని, ఇప్పటి వరకు ఎలాంటి డెంగీ కేసు నమోదు కాలేదని, ప్రజలు ఎవరూ భయాందోళనకు గురికావొద్దన్నారు. జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. లింగాల సీహెచ్‌సీ పరిధిలో 10 ప్రత్యేక బృందాలు గ్రామాల్లో పర్యటించి వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ఇంటింటి సర్వేలు జరిపి వ్యాధులను గుర్తిస్తున్నారని చెప్పారు. గ్రామ పంచాయతీలు పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని కోరారు. సీహెచ్‌సీలో త్వరలోనే కు.ని. ఆపరేషన్లు చేస్తామన్నారు. వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉంటారని ప్రజలు ప్రైవేట్‌కు వెళ్లకుండా ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఎస్ఓ ప్రదీప్, ఏఎంఓ శ్రీనివాస్, ప్రవళిక, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.



లింగాల ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ సుధాకర్‌లాల్

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి

అచ్చంపేట: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తుందని, ఈ అవకాశాన్ని గ్రామీణ క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని జాతీయ స్థాయిలో రాణించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం అచ్చంపేటలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని చేదురుబావితండాకు చెందిన రాత్లావత్ దినేష్‌నాయక్ అండర్–19లో తెలంగాణకు ఎంపికవడం అభినందనీయమన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. దినేష్‌కు తండ్రి లేకపోయినా తల్లి వ్యవసాయ కూలీగా పనిచేస్తూనే పిల్లల బంగారు భవిష్యత్‌కు పునాది వేశారని, కూతురు సివిల్స్‌కు ప్రిపేర్ అవడం గర్వించదగ్గ విషయమన్నారు. దినేష్‌కు అవసరమైన సాయం ప్రభుత్వం తరపున, తాను స్వయంగా అందిస్తానని హామీ ఇచ్చారు. గ్రామీణ క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అచ్చంపేట ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సంబంధించిన మ్యాచ్‌లకు సమాయత్తమవుతున్న క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తానన్నారు. అలాగే నల్లమలకు చెందిన క్రీడాకారులు చాలామంది రాష్ట్రస్థాయిలో రాణిస్తున్నారని, వంకేశ్వరం అమ్మాయి సీనియర్ సెలక్షన్‌లో ఎంపికైందని కొనియాడారు. అంకిరోనిపల్లికి చెందిన క్రీడాకారులు భూసి, వంశీలను త్రీడేలో ఆడించేలా చూస్తానన్నారు. అచ్చంపేట ఎన్టీఆర్ మినీ స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం రూ.6.50 కోట్లు మంజూరు చేసిందని, త్వరలోనే పనులు చేపడుతామన్నారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ శాంతకుమారి, మార్కెట్ చైర్మన్ అరుణ, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు మనోహర్, మున్సిపల్ మాజీ చైర్మన్ తులసీరాం, గోపాల్‌రెడ్డి, అమీనొద్దీన్, రమేష్‌రావు తదితరులు పాల్గొన్నారు.



అండర్-19కు ఎంపికైన దినేష్‌ను సన్మానిస్తున్న గువ్వల బాలరాజు

నిలకడగా ఉల్లి ధరలు

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లి వేలం నిర్వహించగా.. గత వారం వచ్చిన ధరలతో నిలకడగానే ఉన్నాయి. మార్కెట్‌కు దాదాపు 500 బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది. నాణ్యతగా ఉన్న ఉల్లి క్వింటాల్ ధర గరిష్టంగా రూ.2,600 వరకు పలికింది. రెండో రకం ఉల్లి కనిష్టంగా రూ.2,100 వరకు ధర వచ్చింది.

ఈకేవైసీ తప్పనిసరి..

- రేషన్ కార్డులకు అనుసంధానం చేయాల్సిందే
- జిల్లాలో మందకొడిగా సాగుతున్న ప్రక్రియ
- ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యం
- బియ్యం పంపిణీలో పెరగనున్న పారదర్శకత

నాగర్‌కర్నూల్: రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోంది. ఆహార భద్రతా కార్డుల్లో అనర్హుల పేర్లను తొలగించి నిజమైన పేదలకే రేషన్ సరుకులు అందేలా కృషిచేస్తోంది. దీనికోసం ఈకేవైసీ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో కార్డులో పేరు ఉన్న కుటుంబీకులంతా రేషన్ దుకాణాలకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. గత కొన్నేళ్లుగా రేషన్‌కార్డులకు సంబంధించి తనిఖీలు చేయకపోవడంతో కొన్నిచోట్ల అనర్హులకు, చనిపోయిన వారి పేరుపై కూడా రేషన్ సరుకులు అందుతున్నాయి. దీంతో రేషన్ కార్డులో ఉన్న ప్రతిఒక్కరూ ఈకేవైసీ నమోదు చేయించుకుంటే అర్హులు, చనిపోయిన వారి విషయంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంటుంది. దీంతో జిల్లాలో రేషన్ డీలర్లు ఈ ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించారు. రేషన్ డీలర్ల వద్ద ఉన్న ఈ పాస్ మిషన్‌ల ద్వారా డీలర్లు ఈకేవైసీ చేస్తున్నారు.

ఇలా చేసుకోవాలి..

రేషన్ కార్డులో పేరున్న కుటుంబీకులంతా చౌకధర దుకాణానికి వెళ్లి ఈ–పాస్ మిషన్‌లో వేలిముద్ర వేయాలి. వేలిముద్ర వేయగానే లబ్ధిదారుడి ఆధార్ నంబర్ వస్తుంది. మిషన్‌లో గ్రీన్ లైన్ వస్తే ఈకేవైసీ ప్రక్రియ పూర్తయినట్లు.. రెడ్‌లైన్ వస్తే రేషన్ కార్డులో పేరున్న వ్యక్తి ఆధార్ మ్యాచ్ కాలేదని ఈకేవైసీ రిజక్ట్ అవుతుంది. అలాంటి వారి పేర్లను రేషన్ కార్డు నుంచి తొలగిస్తారు. ఇందుకోసం కార్డులో పేరున్న వ్యక్తులంతా రేషన్ దుకాణానికి వెళ్లి వేలి ముద్రలు ఇవ్వాల్సి ఉంటుంది. ఎవరు వెళ్లకున్నా వారిని రేషన్ కార్డు నుంచి తొలగిస్తారు.



మొత్తం రేషన్ కార్డులు	లబ్ధిదారులు
2,38,052	7,52,628
ఈకేవైసీ పూర్తిచేసిన వారు : 1,25,539	ఇంకా చేయాల్సింది 6,27,089

అవగాహన కల్పిస్తాం..

కుటుంబ యజమానితోపాటు రేషన్ కార్డులో పేరున్న ప్రతిఒక్కరూ వేలిముద్రలు వేసి ఈకేవైసీ చేయించుకోవాలి. రేషన్ షాపుల్లోనే ఈ–పాస్ మిషన్ ద్వారా ఈ ప్రక్రియ పూర్తవుతుంది. అనర్హులను గుర్తించేందుకే ఈ ప్రక్రియ చేపట్టడం జరిగింది. ఈకేవైసీ చేయించుకోకుంటే రేషన్ కార్డు నుంచి పేర్లు తొలగిస్తాం. ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించేలా చూస్తాం.

– స్వామికుమార్, డీఎస్ఓ

జిల్లా పరిధిలో ఇలా..

జిల్లాలో ప్రస్తుతం 2,38,052 రేషన్ కార్డులు ఉండగా.. ఇందులో 18,621 అంత్యోదయ కార్డులు, 40 అన్నపూర్ణ, సాధారణ రేషన్ కార్డులు 2,19,272 కార్డులు ఉన్నాయి. అంత్యోదయ కార్డు ఉన్న వారికి కుటుంబానికి 35 కిలోలు, అన్నపూర్ణ కార్డు ఉన్నవారికి 10 కిలోలు ఉచితంగా ఇస్తున్నారు. జిల్లాలో ఉన్న రేషన్ కార్డు లబ్ధిదారుల కోసం నెలకు 4,861 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని జిల్లాకు కేటాయిస్తున్నారు. ఇప్పటికే ఈకేవైసీ ప్రక్రియ జిల్లాలో మందకొడిగా కొనసాగుతుంది. ఈ విషయమై పెద్దగా అవగాహన లేకపోవడంతో లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. దీనిపై ప్రభుత్వంతోపాటు.. అధికారులు సైతం క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో యువకుడి బలవన్మరణం


కృష్ణయ్య (ఫైల్)

కోస్గి: కుటుంబ కలహాలతో ఓ యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని సర్జఖాన్‌పేటకు చెందిన కృష్ణయ్య (30) తన భార్యతో తరచూ గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో బుధవారం భార్యభర్తలు గొడవపడ్డారు. దీంతో మనస్తాపానికి గురై కృష్ణయ్య ఇంట్లో ఉన్న పురుగుమందు తాగాడు. కుటుంబసభ్యులు ఆలస్యంగా గుర్తించి ఓ ప్రైవేట్ వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కల్లుకు బానిసై వ్యక్తి..

మహబూబ్‌నగర్ క్రైం: కల్లు తాగేందుకు డబ్బులు లేక ఓ వ్యక్తి పురుగుమందు తాగి మృతి చెందినట్లు రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన కథనం మేరకు.. నవాబ్‌పేట మండలం కూచూరుకు చెందిన రాంపురం రాజు (35) జిల్లాకేంద్రంలోని టీచర్స్ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. ఇతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కల్లుకు బానిసైన రాజు బుధవారం ఉదయం తాగడానికి డబ్బులు లేకపోవడంతో క్షణికావేశంలో ఇంట్లో ఉన్న పురుగుమందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందాడు. భార్య యాదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

చెట్టుకు ఉరేసుకొని..


నీలం కుర్మయ్య (ఫైల్)

కొత్తకోట రూరల్: ప్రేమించిన యువతి తనకు దక్కకుండా పోయిందని ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దమందడి మండలం మోజర్ల స్టేజీ సమీపంలో ఉన్న బుర్రవాగు దగ్గర చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్ కథనం మేరకు.. పాన్‌గల్ మండలం రేమద్దులకు చెందిన నీలం కుర్మయ్య (28) కొంతకాలంగా ఓ యువతిని ప్రేమించాడు. సదరు యువతికి పెళ్లి కావడంతో మనస్తాపానికి గురై చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తమ్ముడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

చేపల వలలో చిక్కిన కొండచిలువ



గోపాల్‌పేట: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న చిన్న వాగులో చేపల కోసం వేసిన వలలో కొండచిలువ చిక్కింది. బుధవారం మండల కేంద్రానికి దామోదర్ చూసి స్నేక్ సొసైటీ సభ్యుడు కృష్ణసాగర్‌కు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి వల నుండి బయటకు తీసి డీఎఫ్‌ఓ నవీన్‌రెడ్డి అనుమతితో శ్రీశైలం అడవుల్లో వదలనున్నట్లు కృష్ణసాగర్ తెలిపారు. కొండచిలువ ఐదు ఫీట్ల పొడవు, 15 కిలోల బరువు ఉంటుందని పేర్కొన్నారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు తగ్గు ముఖం పట్టింది. ఉదయం ఎగువ, దిగువలోని ఎనిమిది యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని కొనసాగించి, రాత్రి నాలుగు యూనిట్లలో నిలిపివేశారు. బుధవారం రాత్రి 9 గంటల వరకు ప్రాజెక్టుకు 14 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 14,314 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 94 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 731 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 16,919 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.214 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

శ్రీశైలంలో 854.8 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో బుధవారం 854.8 అడుగుల వద్ద 91.4060 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 7,834, సుంకేసుల నుంచి 4,446 మొత్తం 12,280 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం వస్తున్నాయి. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 2,000, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,450, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,450 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భకేంద్రంలో 1.678 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 3,209 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదిలారు. జలాశయంలో 104 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

సుంకేసులకు 6వేల క్యూసెక్కులు..

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువన కురిసిన వర్షాలు, వాగుల వల్ల బుధవారం ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నట్లు జేఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 6,170 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఒక గేటును తెరిచి శ్రీశైలం ప్రాజెక్టుకు 4,446 క్యూసెక్కులు, కేసీ కెనాల్ కు 1,616 క్యూసెక్కులు వదిలినట్లు ఆయన తెలిపారు.

లిక్కర్ కల్తీ దందా!


కొల్లాపూర్‌లో మద్యం కల్తీకి పాల్పడ్డ వారిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు (ఫైల్)

వైన్స్‌లో లిక్కర్ బాటిళ్లలో కల్తీని గుర్తించిన ఎక్సైజ్ పోలీసులు

- నిర్వాహకుడు, కల్తీకి పాల్పడ్డ వ్యక్తి అరెస్ట్
- అప్రమత్తమైన ఎక్సైజ్ అధికారులు

కొల్లాపూర్: కొందరు కేటుగాళ్లు జిల్లాలో మద్యం కల్తీకి తెరలేపారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న మద్యాన్ని సొంత తెలివితేటలతో ఎవరూ గుర్తుపట్టలేని విధంగా కల్తీ చేసేస్తున్నారు. పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్‌లోని ఓ వైన్స్ షాపు నిర్వాహకులు మద్యం కల్తీ చేస్తూ దొరికిపోయారు. దీంతో జిల్లా ఎక్సైజ్ పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు.

మద్యం బాటిళ్లలో నీళ్లు కలుపుతూ..

కల్వకోల్‌లోని సింధూ వైన్స్ దుకాణంలో మద్యం కల్తీ అవుతుందనే అనుమానంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కొంతకాలంగా నిఘాపెట్టారు. ఈ దుకాణం నిర్వాహకులు ఇటీవలనే మారారు. వైన్స్‌లో నాసిరకం మద్యం అమ్ముతున్నారని గ్రామానికి చెందిన కొందరు స్థానిక ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విక్రయాలు, స్టాక్ దిగుమతిపై దృష్టి పెట్టారు. రాయల్‌స్టాగ్, ఐబీ, ప్లాస్టిక్ లిక్కర్ బాటిల్స్ మూతలు తొలగించి, వాటిలోకి కొంత మద్యాన్ని బయటకు తీసి, నీళ్లను నింపడాన్ని ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. కల్తీ చేసిన 97 బాటిళ్లను మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. వైన్స్ నిర్వాహకులు రాజేష్, కల్తీకి పాల్పడిన యాదగిరిని అరెస్ట్ చేశారు.

సీసాల మూతలు తీయడంలో దిట్ట..

మద్యం కల్తీకి పాల్పడడంలో రకరకాల టెక్నిక్‌లు ఉంటాయి. వీటిలో ఒకటి మద్యాన్ని బయటికి తీసి, వాటిలో నీళ్లు నింపడం. లిక్కర్ బాటిల్ మూతకు ప్రభుత్వ స్టాక్ పాయింట్ నుంచి సీల్ వేసి వైన్స్ దుకాణాలకు సరఫరా చేస్తారు. సీల్ డ్యామేజ్ కాకుండా మూతలు తీయడంలో కొందరు నిపుణులైన కల్తీ గాళ్లు ఉంటారు. వీరు హైదరాబాద్, రాయచూర్, బెంగుళూరు ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటారు. ఇటీవల కాలంలో జిల్లాలోని మద్యం దుకాణాలను ఇతర ప్రాంతాల వాళ్లు లీజు ప్రాతిపదికన తీసుకుని నడుపుతున్నారు. వారే కల్తీకి శ్రీకారం చుట్టినట్లు సమాచారం. కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ కేంద్రాల్లో కూడా మద్యం విక్రయాల్లో కల్తీలు అవుతున్నాయనే ప్రచారం ఉంది. ఏడాది క్రితం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో మద్యం సేవించి ఇద్దరు మృతి చెందారు. దీనిపై ఆందోళనలు చేయడంతో అధికారులు విచారణ చేపట్టి దుకాణాల్లో తనిఖీలు చేశారు. నకిలీ మద్యం లేదని నిర్ధారణ చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి మండలం మరికల్ గ్రామంలో కొన్నేళ్ల కిందట కల్తీ మద్యం తయారు చేసి, అక్కడే సీసాల్లో నింపి, నైనపల్లి మైసమ్మ గుడి వద్ద విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన మద్యాన్ని అధికారులు పట్టుకొని నిందితులను అరెస్ట్ చేశారు.

కొనుగోళ్లు, అమ్మకాలపై నిఘా..

జిల్లాలోని ప్రాంతాల వారీగా మద్యం విక్రయాలపై ఎక్సైజ్ శాఖ అధికారులకు రెగ్యులర్‌గా నివేదికలు పంపుతుంటారు. ప్రతి నెలా విక్రయాలు, స్టాక్ పాయింట్ నుంచి వచ్చే లిక్కర్ బాటిళ్ల లెక్క సమానంగా ఉండాలి. స్టాక్ పాయింట్ నుంచి బుకింగ్ తగ్గినా, దుకాణంలో ఎక్కువ విక్రయాలు చేస్తున్నట్లు అనుమానం వచ్చినా అధికారులు ఆయా వైన్స్ దుకాణాలపై నిఘా పెడుతుంటారు. కల్వకోల్ సింధూ వైన్స్‌కు స్టాక్ పాయింట్ నుంచి మద్యం బుకింగ్ కొంత మేరకు తగ్గడంతో అధికారులు నిఘా ఏర్పాటు చేసి, కల్తీ విషయాన్ని గుర్తించారు.

రెగ్యులర్‌గా పరిశీలిస్తాం..



జిల్లాలో మద్యం కల్తీ గతంలో ఎప్పుడూ కాలేదు. కల్వకోల్‌లోని వైన్స్ దుకాణంలో లిక్కర్ బాటిళ్లలో నీళ్లను నింపడాన్ని గుర్తించాం. దుకాణం నిర్వాహకుడిని, కల్తీకి పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేశాం. వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం. జిల్లా వ్యాప్తంగా వైన్స్‌లలో తనిఖీ ముమ్మరం చేస్తాం. రెగ్యులర్‌గా ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో పాటు, స్థానిక ఎక్సైజ్ అధికారులు మద్యం విక్రయాలు, కల్తీ అంశాలపై నిఘా పెడుతున్నారు. మేము కూడా పర్యవేక్షణ చేపడతాం.

– ఫయాజుద్దీన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, నాగర్‌కర్నూల్ జిల్లా

జిల్లాలోని ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోగల వైన్స్ దుకాణాలు	కొల్లాపూర్	నాగర్‌కర్నూల్	తెలకపల్లి	కల్వకుర్తి	అచ్చంపేట	జిల్లాలోని బార్ అండ్ రెస్టారెంట్ల సంఖ్య	జిల్లాలో లిక్కర్ అమ్మకాలు సరాసరి
	12	18	7	17	13	6	నెలకు: 55 వేల కాటన్లు

బైక్ ఢీకొని బాలుడి దుర్మరణం

- రోడ్డుపై ఆందోళన చేసిన కుటుంబ సభ్యులు


వినయ్ (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: మద్యం మత్తులో ఉన్న ద్విచక్ర వాహనదారుడు రోడ్డు దాటుతున్న బాలుడిని ఢీకొట్టడంతో మృతిచెందినట్లు రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన కథనం మేరకు.. మహబూబ్‌నగర్‌లోని ఏనుగొండకు చెందిన కొత్త వినయ్ (9) మంగళవారం రాత్రి ఏనుగొండ చౌరస్తాలోని మర్రిచెట్టు దగ్గర ఏర్పాటు చేసిన గణనాథుడి దగ్గర ఆడిపాడిన తర్వాత ఇంటికెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా జడ్చర్ల నుంచి మహబూబ్‌నగర్ వైపు వస్తున్న బుల్లెట్ వాహనదారుడు మద్యం మత్తులో ఢీకొట్టాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. బాలుడి తండ్రి కొత్త లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

రోడ్డుపై ధర్నా..

బాలుడి కుటుంబసభ్యులు బుధవారం ఉదయం ఏనుగొండలోని మహబూబ్‌నగర్–జడ్చర్ల ప్రధాన రోడ్డుపై ఆందోళన చేశారు. రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకొని వారికి సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

వినాయకుడి నిమజ్జనంలో అపశ్రుతి

- విద్యుదాఘాతంతో యువకుడు మృతి
- సీజీతండాలో అర్ధరాత్రి ఘటన


లక్ష్మీపతి (ఫైల్)

ఉప్పునుంతల: మండలంలోని మారుమూల సీబీ తండాలో మంగళవారం అర్ధరాత్రి వినాయకుడి నిమజ్జనంలో అపశ్రుతి చోటుచేసుకుంది. వినాయకుడిని నిమజ్జనం చేయడానికి వాహనంలో ఊరేగిస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌తో తండాకు చెందిన సబావట్ లక్ష్మీపతి(25) అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ గురుస్వామి కథనం ప్రకారం.. లక్ష్మీపతి మినీ గూడ్స్ వాహనం నడుపుతూ జీవనం సాగించేవాడు. తండాలో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేయడానికి మరో వాహనంలో వినాయక విగ్రహాన్ని ఎక్కించారు. అలాగే లక్ష్మీపతి వాహనంలో సౌండ్ బాక్స్‌లు అమర్చి రాత్రి 11.30 గంటల సమయంలో ఊరేగిస్తున్నారు. వాహనంలో పెట్టిన సౌండ్ బాక్స్‌ల పైకి ఎక్కిన లక్ష్మీపతి చేతులు ఎత్తడంతో పైన ఉన్న విద్యుత్ తీగలకు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. లక్ష్మీపతి భార్య మౌనిక ప్రస్తుతం 8 నెలల గర్భిణి. ఈ ఘటనతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ విషయమై బుధవారం లక్ష్మీపతి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహానికి అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చేతగాని సన్నాసులు వస్తున్నారు..

వారి మాయమాటలు నమ్మొద్దు

- జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


రాజాపూర్‌లో లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రాజాపూర్: రాష్ట్రంలో ఆడవాళ్లకు, అన్నదాతలకు అండగా నిలిచింది బీఆర్‌ఎస్ ప్రభుత్వం అని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం రాజాపూర్‌లో 23 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు, గృహలక్ష్మి పథకం కింద మంజూరైన ప్రొసీడింగ్‌లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 50 ఏళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం ఏం చేసిందో.. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి మీరే ఆదరించాలని కోరారు. టీఆర్‌ఎస్ పాలనకు ముందు పదేళ్ల అధికారంలో ఉండి కాంగ్రెస్ సన్నాసులు ఏం పొడిచారో గమనించాలని అన్నారు. కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతు బీమా, రైతు పండించిన ధాన్యం ఇంటి ముందుకే వచ్చి ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర ఇస్తుందని చెప్పారు. మొన్న సోనియాగాంధీ వచ్చి 'దో లాక్ మాఫీ కరేంగే, చార్ హజార్ పింఛన్ దియాంగే' అంటూ ఎన్నికల సందర్భంగా ఓట్ల కోసం మోసపూరిత ప్రకటనలు చేసే కాంగ్రెస్ నాయకులను నమ్మవద్దన్నారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు బచ్చిరెడ్డి, ఎంపీపీ సుశీల, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, నాయకులు శ్రీశైలంయాదవ్, అభిమన్యురెడ్డి, ఎంపీడీఓ లక్ష్మీదేవి, తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసూయతో మాట్లాడితే ప్రజలే బుద్ధి చెబుతారు

- మాజీ మంత్రి ఈటల రాజేందర్


అమిస్తాపూర్‌లో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

భూత్పూర్: ప్రపంచం అబ్బురపరిచే గొప్ప నాయకుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మంత్రి కేటీఆర్ అసూయతో, సంక్లిష్టభావంతో మాట్లాడితే రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని బీజేపీ చేరికల కమిటీ అధ్యక్షుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగసభ ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమైక్యాంధ్రలో రూ.74వేల కోట్లు అప్పు పుడితే తెలంగాణ వచ్చాకా సీఎం కేసీఆర్ ఎఫ్‌ఆర్‌బీఎం రుణాలు, గ్యారంటీ రుణాలు ఆరేళ్ల కాలంలో అదనంగా రూ.5లక్షల కోట్లు రుణం తీసుకుని ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు, ఆడుతున్న డ్రామా కోసం జాతీయ బ్యాంకులు ఇచ్చిన అప్పులతో పథకాలకు ఖర్చు చేస్తున్న విషయం గుర్తుకు లేదా అని ప్రశ్నించారు. నరేంద్రమోదీ ప్రభుత్వం పేదలకు సొంతింటి కల నెరవేర్చడానికి దేశమంతా మూడున్నర కోట్ల ఇళ్లు కడితే, అహంకార పూరితంగా 29 సీఎంలకు రాని ఆలోచన, ప్రగల్బాలు పలికి 10 లక్షల ఇళ్లు కడతామని, 2లక్షల91 వేల ఇళ్లు మంజూరు చేసి కేవలం లక్షా 35వేల ఇళ్లు కట్టి 35వేల ఇళ్లు పంచి పేదల సొంతింటి కల నెరవేరకుండా పేదోళ్ల నోట్లో మట్టి కొట్టారని విమర్శించారు. దేశంలో ఒక్క స్కామ్, అపకీర్తి లేకుండా మళ్లీ మోదీ నాయకత్వం అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రజలు కోరుకుంటే సీఎం కేసీఆర్ కుటుంబం మాత్రం ద్వేషం, గుడ్డి అసూయతో ఉన్నారన్నారు. సీఎం కేసీఆర్ తిరిగి ఎలాగైనా అధికారంలోకి రావాలని హైదరాబాద్ చుట్టూ కలెక్టర్లకు లక్ష్యం విధించి, ప్రతి రోజు ఇన్ని డబ్బులు రావాలని, ఆ డబ్బుతో ఎన్నికల్లో ప్రజలను ప్రలోబపెట్టి మళ్లీ గెలవాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ గుజరాత్, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాల్లో ఫ్లెక్సీలు, టీవీల్లో, పేపర్‌లో యాడ్‌లు, హోర్డింగ్‌లతో ఘన కీర్తి పొందాలని, తెలంగాణ ప్రజల పైసలతో, రూ.వందల కోట్లు యాడ్స్ ఇచ్చి చెలామణి అవుతున్నారన్నారు. రెండు నెలల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోతదని, నవంబర్‌లో ఎన్నికల నోటిఫికేషన్ రాబోతుందని, మీ ప్రభుత్వానికి చివరి రోజులన్నారు. నరేంద్రమోదీ సభను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, ఆచారి, సుదర్శన్‌రెడ్డి, ఎగ్గని నర్సింహులు, రవీందర్‌రెడ్డి, డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, దేవేందర్, రాంరెడ్డి, సదానంద్, రాజగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అలంపూర్ ఆలయాల హుండీ లెక్కింపు


అలంపూర్ ఆలయాల హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న అధికారులు, పాలకమండలి సభ్యులు

- రూ.2 వేల నోట్ల మార్పిడి గడువు సమీపిస్తుండటంతోనే..

జోగుళాంబ శక్తిపీఠం: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2 వేల నోట్ల మార్పిడీకి ఈ నెలాఖరు చివరి గడువు కావడంతో బుధవారం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల హుండీ లెక్కింపు నిర్వహించారు. 55 రోజులకుగాను రూ.32,02,163 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్య తెలిపారు. లెక్కింపు కార్యక్రమాన్ని జిల్లా దేవాదాయశాఖ పరిశీలకురాలు వెంకటేశ్వరమ్మ పర్యవేక్షించారు. లెక్కింపులో కొంత విదేశీ కరెన్సీతో పాటు 29.500 గ్రాముల మిశ్రమ బంగారం, 189.700 గ్రాముల మిశ్రమ వెండి కూడా ఉన్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

హుండీ తాళం మొరాయించడంతో..

బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలోని ఓ హుండీ తీసే క్రమంలో తాళం మొరాయించింది. టెక్నీషియన్‌ను పిలిపించినా ఫలితం లేకపోవడంతో చివరకు గడ్డపారతో పగలగొట్టాల్సి వచ్చింది. హుండీ తెరిచేందుకు సుమారు రెండు గంటలకుపైగా అధికారులు, పాలకమండలి సభ్యులు అవస్థలు పడాల్సి వచ్చింది. కాగా వచ్చిన ఆదాయాన్ని యూబీఐలో జమ చేసినట్లు ఆలయ పాలక మండలి తెలిపింది. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, ఆనంద్‌శర్మ, బి.సత్యన్న, వెంకటేష్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

మద్దిమడుగు అంజన్న హుండీ ఆదాయం రూ.11,11,688..



అమ్రాబాద్: పదర మండలం మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి హుండీని బుధవారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. 45 రోజుల హుండీ లెక్కించగా రూ.11,11,688 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. మిశ్రమ వెండి కిలో 534 గ్రాములు వచ్చింది. మొత్తాన్ని పదర ఏపీజీవీబీలో జమ చేసినట్లు అధికారులు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ విష్ణుమూర్తి, ముఖ్య కార్యనిర్వహణ అధికారి రంగాచారి, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, జైపాల్‌రెడ్డి, జంగయ్య, అజయ్, ఆలయ ప్రధాన అర్చకుడు వీరయ్యశర్మ, భక్తులు పాల్గొన్నారు.

మన్యంకొండలో..



మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, ఇన్‌స్పెక్టర్ వీణాధరణి పర్యవేక్షణలో లెక్కింపు కొనసాగింది. మొత్తం రూ.27,12,489 ఆదాయం సమకూరిందని ఈఓ వెల్లడించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ నిత్యానందాచారి, పాలక మండలి సభ్యులు రాజేందర్‌రెడ్డి, వై.శ్రీనివాసులు, సువర్ణ, అపర్ణ, లక్ష్మీదేవి, మంజుల, మహాలక్ష్మి, ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ ప్రసాద్, చెన్నకేశవులు, నందకిషోర్, రమ్యసాయి తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో పటిష్ట నిఘా


మాట్లాడుతున్న డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్

- డబ్బు, మద్యం తరలింపుపై ప్రత్యేక దృష్టి
- 24 గంటల చెక్‌పోస్టుల్లో తనిఖీలు నిర్వహించాలి
- జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్



మహబూబ్‌నగర్ క్రైం/ వనపర్తి: రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి పాలమూరు జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పటిష్టం చేయాలని జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్ అన్నారు. బుధవారం ఆయన ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాల ఎస్పీలతో అడ్డాకులలో, వనపర్తి ఎస్పీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జిల్లా సరిహద్దులో ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేసి 24 గంటలపాటు తనిఖీలు చేపట్టాలన్నారు. వాహనాల రాకపోకలతోపాటు ఇతర అంశాలపై దృష్టిపెట్టాలని గంజాయి, మాదకద్రవ్యాల వ్యాపారం నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చెక్ పోస్టుల దగ్గర మద్యం సరఫరా, డబ్బు తరలింపుపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలన్నారు. సరిహద్దులో విధులు నిర్వహించే పోలీసులు పరస్పరం సమాచారం ఇచ్చుకోవాలని, సమాచార వ్యవస్థను సమన్వయం చేసుకుంటూ ఎన్నికలు సమర్థవంతంగా జరిగేలా చూడాలన్నారు. చెక్‌పోస్టుల దగ్గర విధుల్లో ఉండే సిబ్బంది నేరాలకు సంబంధించిన విషయాలపై కూడా ఫోకస్ చేయాలని సూచించారు. మావోయిస్టుల కదలికలతోపాటు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అంశంపై చర్చించారు. ట్రబుల్ మంగర్స్ కదలికలపై నిరంతరం నిఘా ఉంచి సమాచారాన్ని పరస్పరం చేరవేసుకోవడం వల్ల ట్రబుల్ మంగర్స్‌ను కట్టడి చేయడం సులభమవుతోందన్నారు. జోగుళాంబ జోన్ పరిధిలోని రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పకడ్బందీగా తనిఖీలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో మహబూబ్‌నగర్ ఎస్పీ కె.నరసింహ, నారాయణపేట ఎస్పీ వెంకటేశ్వర్లు, వనపర్తి ఎస్పీ రక్షితామూర్తి, గద్వాల ఎస్పీ సృజన, నాగర్‌కర్నూల్ ఎస్పీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణ భేష్..

వనపర్తి జిల్లాలో శాంతిభద్రతల విషయంలో పోలీసుల పనితీరు బాగుందని డీఐజీ కితాబిచ్చారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఎస్పీ, డీఎస్పీ, కొత్తకోట సీఐ కార్యాలయాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఎన్నికలు రానున్న సందర్భంగా ఉన్నతాధికారుల సూచన మేరకు ముందస్తు సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారు. ఎస్‌బీ, ఇంటెలిజెన్స్, డీసీఆర్‌బీ, ఫింగర్ ప్రింట్, ట్రాఫిక్, డీపీఓ, స్టోర్, ఏఆర్ విభాగాల రికార్డులను పరిశీలించారు. ఏఆర్ పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించి ఎస్కార్ట్, గార్డ్స్, వీఐపీ బందోబస్తు తదితర అంశాల గురించి ఆరాతీశారు. అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. ఆయన వెంట ఏఎస్పీ రామదాసు తేజావత్, డీఎస్పీ ఆనంద్‌రెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, సీఐలు మహేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, రత్నం, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.